# బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి

**అన్ని వర్గాలకు అందుతున్న సంక్షేమ పథకాలు**

**నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ చేసింది శూన్యం**

**ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్**

పెద్దవూర, అక్టోబర్ 31 : బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే తెలంగాణలో అభివృద్ధి ప్రారంభమైందని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. మండలంలోని తుంగతుర్తి, రామన్నగూడెం, రామన్నగూడెంతండా, ఏనిమీది తండా, పొట్టివానితండా, నాయనవానికుంట తండా, జయరాంతండా, కొత్తతండా, పర్వేదుల, పాల్తీతండా, మర్రిపురి తండా గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించి మాట్లాడారు. పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్రం ఇంకా అభివృద్ధి కావలంటే మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. 64 సంవత్సరాలు రాష్ట్రాన్ని, దేశాన్ని పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. గతంలో అనేక పర్యాయాలు మంత్రిగా, ఎమ్మెల్యేగా పని చేసిన జానారెడ్డి నాగార్జునసాగర్ నియోజకవర్గాన్ని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల భగత్, పక్కన ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్



పెద్దవూర మండలం తుంగతుర్తి గ్రామంలో బతుకమ్మలతో ఎమ్మెల్యేకు భగత్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారన్నారు. నియోజకవర్గం పూర్తిగా వెనుక బడడానికి ఆయనే కారణమన్నారు. గెలువగానే హైదరాబాద్‌కు మకాం మార్చి ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం లేకనే కొడుకును నిలబెట్టాడని విమర్శించారు. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాతే నాగార్జునసాగర్ అభివృద్ధి ప్రారంభమైందని తెలిపారు. హాలియా, నందికొండను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కేదే అన్నారు. రైతులకు రైతుబంధు, రైతు బీమాతో పాటు పుష్కలంగా సాగునీటిని అందించి వ్యవసాయాన్ని పండుగలా మార్చారన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రభుత్వ పథకంతో లబ్ధిపొందని ఇల్లు లేదన్నారు. మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మరింతగా పెంచనున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లుగా కేసీఆర్ భరోసా పేరుతో ప్రతి ఇంటికీ బీమా అందిస్తామని, అర్హులైన మహిళలకు రూ.400కే గ్యాస్ సిలెండర్, పేద మహిళలకు రూ.3వేల ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. దాంతో పాటు రైతుబంధు, ఆసరా పింఛన్లను సైతం పెంచనుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని ఆలోచించాలని.. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై ప్రతి గ్రామంలో చర్చ జరపాలన్నారు. బీఆర్ఎస్‌కు ప్రజలే బాస్‌లని, ప్రజలు కోరిన విధంగా రాష్ట్రంలో పాలన సాగుతుందని పేర్కొన్నారు. అదే కాంగ్రెస్ పార్టీకి మాత్రం ఢీల్లీ పెద్దలే బాస్‌లని, వారు చెప్పినట్లు రాష్ట్ర నాయకులు చేస్తారే తప్పా ప్రజల గురించి ఆలోచించరని, ఈవిషయాన్ని ప్రజలు గుర్తుంచుకోలని కోరారు. ప్రజల బాగోగులు పట్టించుకునే బీఆర్ఎస్‌కే రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు.

### కడుపు నింపే కేసీఆర్ కావాలా.. కడుపుకొట్టే కాంగ్రెస్ కావాలా .. : ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్

రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా పేదలు, బడుగు, బలహీన వర్గాల కడుపు నింపుతున్న బీఆర్ఎస్ పార్టీ కావాలా.. పేదల కడుపుకొట్టే కాంగ్రెస్ కావాలా అనేది ప్రజలు ఆలోచన చేయాలని ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ కోరారు. సమైక్య రాష్ట్రంలో గిరిజన తండాలను పట్టించుకున్న నాధుడే లేకుండా పోయాడని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో పాటు అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతి తండా అభివృద్ధి పథంలో పయనిస్తున్నదంటే.. ఆ ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. ఏనాడు గిరిజన సమస్యలు పట్టించుకోని మాజీ మంత్రి జానారెడ్డి ఇప్పుడు ఏముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టాలని, రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటక వెంకట్‌రెడ్డి, రైతుబంధు సమితి చైర్మన్ గజ్జెల లింగారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జటావత్ రవినాయక్, ప్రధాన కార్యదర్శి కర్నాటి మునిరెడ్డి, మైనార్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ అబ్బాస్, బీఆర్ఎస్ కార్మిక వర్గం ప్రధాన కార్యదర్శి షేక్ బషీర్, పార్టీ యూత్ మండలాధ్యక్షుడు మెండె సైదులు యాదవ్, నాయకులు కర్ణ బ్రహ్మారెడ్డి, వాసుదేవుల సత్యనారాయణ, రమావత్ రవినాయక్, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామశాఖ అధ్యక్షులు, నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

### కాగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

పెద్దవూర : నాగార్జునసాగర్ నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధికి ఆకర్షితులై మండలంలోని పలు గ్రామాలకు చెందిన 100 కాంగ్రెస్ పార్టీ కుటుంబాలు మంగళవారం ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అందుకే ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు



బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

## 13 గ్రామాల్లో ఎమ్మెల్యే భగత్ ప్రచారం

**● విజయ తిలకం దిద్ది బ్రహ్మారథం పట్టిన ప్రజలు**

హాలియా : నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ రెండో రోజు ఎన్నికల ప్రచారం మంగళవారం పెద్దవూర మండలంలో సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మొత్తం 13 గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే తమ గ్రామానికి వస్తున్నాడని తెలిసి ఆయా గ్రామాల ప్రజలు, గిరిజనులు వ్యవసాయ పనులు మానుకొని పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారు. మహిళలు ఎమ్మెల్యేకు బతకమ్మలు, మంగళహారతులతో స్వాగతం పలికారు. విజయ తిలకం దిద్ది మీకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులతో పాటు ప్రజలు సైతం ఆయన వెంట ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు గిరిజనులను ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం మాత్రమే వాడుకున్నారని, తండాలను అభివృద్ధి చేయాలనే ఆలోచనే వారికి లేకపోయిందన్నారు. సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించడంతో పాటు వాటిని అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. జానారెడ్డి చేసిందేమి లేదని.. ఆయన కొడుకు పెద్దగా చేయబోయేది లేదని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి : ఏసీ శ్రీనివాస్

హాలియా, అక్టోబర్ 31 : కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని పులిమామిడి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం కోసిన తరువాత ఆరబెట్టుకొని, తూర్పాల పట్టిన తరువాతే రైతులు ధాన్యాన్ని ఐకేపీ కేంద్రానికి తీసుకురావాలని కోరారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా ట్యాబ్‌లో రైతుల వివరాలను పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం బెనర్జీ, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం కళావతి, సీసీ సైదయ్య పాల్గొన్నారు.



పులిమామిడి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్

## రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

నిడమనూరు : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని నిడమనూరు పీఏసీఎస్ కార్యదర్శి బుచ్చాల జానయ్య గౌడ్ సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలం ధాన్యాన్ని ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్రం ఇన్‌చార్జి కడారి గోవర్ధన్, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.



నిడమనూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ కార్యదర్శి జానయ్య గౌడ్

## ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకుల దాడులు

నందికొండ, అక్టోబర్ 31 : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే బీఆర్ఎస్ నాయకులపై గుండాలతో దాడులు చేయిస్తున్నారని మున్సిపల్ కౌన్సిలర్ రమేష్‌జీ అన్నారు. మెదక్ ఎంపీ, దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ.. మంగళవారం హిల్‌కాలనీలోని ప్రధాన కూడలీలో కాంగ్రెస్ పార్టీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఎలాగైన గెలవాలనే కాంగ్రెస్ గుండాలతో దాడులు చేయిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఆ పార్టీని చిత్తుగా ఓడించి తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నిమ్మల ఇందిర, నాగరాణీవిక్రమ్, నాయకులు చంద్రమౌళి, సైదులు, చాంద్‌పాషా, వీరయ్య, కోదండం, శ్యామ్, రమణ, రామ్మోహన్‌రాజు, లక్ష్మణ్‌నాయక్, శివకుమార్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కౌన్సిలర్లు

## ఎన్నికల నియమావళి ఉల్లంఘన

తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 31: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారులు నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహానికి ఉన్న ముసుగును స్థానిక కాంగ్రెస్ నాయకులు తొలగించి ఆమె వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ విషయమై స్థానికులు ఎంపీడీఓ ఖాజా అజ్గర్‌అలీకి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు పంచాయతీ సెక్రటరీ ఘటనా స్థలానికి చేరుకొని ఇందిరాగాంధీ విగ్రహానికి తిరిగి ముసుగు వేశారు. ఈ విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా తమకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందలేదని, దాంతో ఎవరిపై చర్యలు తీసుకోలేదని చెప్పారు.



ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు